రోడ్లపై మురుగు పరుగు



రోడ్డుపై పారుతున్న మురుగు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి నాగార్జునసాగర్ రహదారిపై డ్రైనేజీ మురుగు నీరు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. నాగార్జునసాగర్ రహదారిపై ఏపీఎస్ఈబీ కాలనీ దగ్గర మాక్స్ వ్యాపార సముదాయం ముందు గత 10 రోజులుగా ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ మురుగు నీరు పొంగిపొర్లుతూ దుర్గంధం వస్తోంది. సంబంధిత సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని నూతన సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ గురువారం జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొత్తపేట డివిజన్ పరిధిలోని రహదారుల ధ్వంసం కావడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నూతన రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వినతిలో కోరారు.

మర్యాదపూర్వక కలయిక



డీకే శివకుమార్‌తో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా కుటుంబ సభ్యులు

నాగోలు: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా కుటుంబ సమేతంగా గురువారం బెంగళూరులోని విధాన సౌధలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిశారు. డీకే శివకుమార్‌తో ఆలోచనలు పంచుకోవడం, రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించడం ఒక చిరస్మరణీయ అనుభవం అని శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు,రాష్ట్రాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై చర్చించడం జరిగిందని తెలిపారు.

సన్మానం

మన్సూరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయి అండ్ సివరేజీ బోర్డు కార్యాలయంలో టెక్నికల్ గ్రేడ్–2 అధికారిగా పదవీ విరణ చేసిన సూర్యోదయ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. నర్సిరెడ్డిని గురువారం ఉద్యోగులు సన్మానించారు. జలమండలి జీఎంలు శ్రీనివాస్‌రెడ్డి, వినోద్‌కుమార్, మహేందర్‌నాయక్, డీజీఎం రాజ్‌గోపాల్‌తో పాటు ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో

దోమల నివారణకు కృషి



మందుల పిచికారీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. కాప్రాయి చెరువు స్థానిక కాలనీల్లో దోమల కారణంగా ఇబ్బంది పడుతున్నామని కార్పొరేటర్ దృష్టికి రాగా గురువారం డ్రోన్ సహాయంతో చెరువులో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..వర్షాల కారణంగా దోమల వృద్ధి భారీగా పెరిగిందని వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానికులు సైతం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటామాలజీ ఏఈ రవీందర్‌రెడ్డి, ఇంజినీరింగ్ ఏఈ కార్తీక్, నాయకులు శంకరయ్యగౌడ్, మురళీకృష్ణ, నారాయణరెడ్డి, రవీందర్, పృధ్వీ, సుధాకర్, సత్యనారాయణ, రాములు, లక్ష్మణ్‌రెడ్డి, రంగానాథ్ పాల్గొన్నారు.

కుండపోత.. ముంచెత్తిన వరద

- నీట మునిగిన రోడ్లు
- పొంగి పొర్లిన డ్రైనేజీలు

ఎల్‌బీనగర్: ఉదయం నుంచి వేడిగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఒక్కసారిగా చల్లబడి ముసురుతో మొదలై కుండపోత కురిసింది. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తుండగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులలో నీరు నిల్వడంతో వాహనాలు స్తంభించిపోయాయి. పలు కాలనీల్లోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగడంతో మురుగు నీరు పలు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



వర్షంతో జాతీయ రహదారిపైన నిలిచిన వాహనాలు



చెరువును తలపిస్తున్న కాలనీ రహదారి



వరద నీటిలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



హయత్‌నగర్ డిపో వద్ద రోడ్డుపై భారీగా పారుతున్న వరద



కాలువను తలపిస్తున్న శుభోదయ కాలనీరోడ్డు

గంట పాటు ఏకధాటిగా..

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో రెండు గంటల ఏకధాటిగా కురిసింది. జాతీయ రహదారిపై నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బెన్నూరి కాంప్లెక్స్ సమీపంలో డ్రైనేజీ ట్రంక్‌లైను మరమ్మతు జరుగుతుండడంతో వరద నీరంతా రోడ్డుపైకి చేరింది. పాఠశాలలు వదిలే సమయంలో కావడంతో పాఠశాలల బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. కొంత మంది విద్యార్థులు వర్షంలో తడుస్తూనే ఇళ్లకు పరుగులు తీశారు. రాఘవేంద్రనగర్. శుభోదయ కాలనీల రోడ్లు కాలువలను తలపించాయి.



బస్ డిపోకు వెళ్లే దారిలో..



మన్సూరాబాద్ నుంచి ఆనంద్ నగర్ రోడ్డులో పారుతున్న వరద



హయత్‌నగర్ విజయ్‌నగర్ కాలనీలో..



బీఎన్‌రెడ్డినగర్‌లో రోడ్లపై పారుతున్న వరద

సొంత నిధులతో సేవలందించడం అభినందనీయం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని మార్గదర్శి కాలనీ కమ్యూనిటీ హాల్, టెలిఫోన్ కాలనీ పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజెన్స్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మధుర ఉపేందర్ రెడ్డి తమ సొంత నిధులతో నిర్మించిన వాష్ రూమ్స్‌ను గురువారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు కిచెన్న గారి లక్ష్మా రెడ్డి(కేఎల్ఆర్) టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించేవాడు నాయకుడు అవుతాడన్నారు. రాబోయే రోజులలో మరింత విస్తృతస్థాయిలో సేవ చేయడానికి ఉపేందర్ రెడ్డి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్ నేత, బండి మధుసూదన్ రావు, నల్లెంకి ధనరాజ్ గౌడ్, కుంచారపు సురేంద్ర కుమార్, సంజీవరెడ్డి, రమణయ్య, జి. వెంకట్ రెడ్డి, రాములు గౌడ్, మధుసూదన్, యస్. శివలింగం గౌడ్, రామ్మూర్తి, వరాల పుష్పలత మోహన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బి. మధుసూదన్, వాసు, యస్. సాంబశివరావు పాల్గొన్నారు.



వాష్ రూమ్స్‌ను ప్రారంభిస్తున్న కేఎల్ఆర్, దేప భాస్కర్‌రెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నాగోలు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) సీఐ రాచపుడి అన్నారు. గురువారం రామాంతాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ చిల్డ్రన్ పార్క్‌ను సందర్శించగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలను నడపవద్దని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. చిన్న పిల్లలు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



అవగాహన కల్పిస్తున్న టీటీఐ సిబ్బంది

దేవాలయం చుట్టూ సీసీ రోడ్డు

మన్సూరాబాద్: రానున్న దేవీ శరన్నవరాత్రి, విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకుని మన్సూరాబాద్‌లోని పోచమ్మ దేవాలయం చుట్టూ సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రానున్న ఉత్సవాలను పురస్కరించుకుని రూ.4.3 లక్షలతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు నాంపల్లి శంకరయ్య, పాతూరి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

లెవల్ లేదని.. రోడ్డంతా తవ్వేశారు!

చైతన్యపురి డివిజన్ సత్యనారాయణ పురం కాలనీ నుంచి ప్రభాత్‌నగర్ కాలనీ పార్కు వరకున్న రోడ్డు గుంతలమయంగా మారడంతో ఏడాది క్రితం నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మంగళవారం రాత్రి 100 అడుగుల మేర ఈ రోడ్డును పూర్తిగా తవ్వేశారు. గమనించిన స్థానికుల సమాచారంతో కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అక్కడకు చేరుకుని సూపర్‌వైజర్ అడగగా సాయినగర్ నుంచి రాఘవ ఆసుపత్రి వరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం జరిగిందని, ఆ రోడ్డుకు ఈ రోడ్డుకు లెవెల్ సరిపోకపోవటంతో తవ్వినట్లు సమాదానం ఇచ్చాడు. ఇదే విషయాన్ని జీహెచ్‌ఎంసీ ఈస్ట్‌జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా ఇంజినీరింగ్ అధికారులు డీఈ, ఏఈ వచ్చి పరిశీలించారు. బాగున్న రోడ్డును తవ్వి ప్రజాధనాన్ని వృథా చేయటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చైతన్యపురి



చెరువు నీటి నాణ్యతను మెరుగుపర్చాలి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు నీటి నాణ్యతను మెరుగుపర్చాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, శానిటేషన్ అసిస్టెంట్ కమిషనర్ రఘుప్రసాద్‌లతో కలిసి గురువారం ఆయన సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను సందర్శించారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనం తర్వాత జరుగుతున్న పనులను పరిశీలించారు. చెరువు పరిసరాల్లో ఉన్న పరిస్థితులను సమీక్షించారు. శానిటేషన్ పనులు, చెరువు నీటిలో పూడికతీత పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని ఆదేశించారు. చెరువు వద్ద పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఆర్చి ప్రారంభం



ఆర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఓంకార్ నగర్ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం వనస్థలిపురం డివిజన్ పరిధి ఓంకార్‌నగర్ కాలనీ–2 ఆర్చిని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలనీల అభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, రవికుమార్, శ్రీధర్‌గౌడ్, మధుగౌడ్, పీవీ.రావు, అజయ్, పద్మ, సాగర్, వీరయ్యగౌడ్, రవికుమార్, రామస్వామి, రవికిశోర్, అంబాజీరావు పాల్గొన్నారు.

బీసీబిల్లు ఆమోదం హర్షణీయం



మన్సూరాబాద్: బీసీ యునైటెడ్ ఫ్రంట్ పోరాటాలతోనే బీసీ 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపారని రాష్ట్ర అధ్యక్షుడు అయితగోని రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్‌కాలనీలోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీసీ యునైటెడ్ ఫ్రంట్ డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును గవర్నర్‌తో ఆమోదింపజేయడం హర్షణీయమన్నారు. బీసీలకు 42శాతం బీసీలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, వెంకటరామయ్య, గాలయ్య, వెంకన్న, విద్యారాణి పాల్గొన్నారు.

18 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 21 తేదీ వరకు సన్‌రైజ్ యోనెక్స్ తెలంగాణ రాష్ట్ర 4వ, మినీ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస్ తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(బీఏటీ) స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ సంయుక్త పర్యవేక్షణలో నాగోల్‌లోని ఉప్పల్ భగాయత్‌లోని విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీ ఎలైట్ గేమర్స్ గ్యారేజ్‌లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 2015 తర్వాత జన్మించిన వారై ఉండాలని, ఈనెల 15 తేదీలోగా పూర్తి వివరాలతో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అండర్–11 విభాగంలో బాల, బాలికలలకు సింగిల్స్, డబుల్స్ పోటీలు ఉంటాయని, ఎంట్రీ ఫీజు కింద సింగిల్స్ రూ.800, డబుల్స్ రూ.1000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గుజరాత్ రాష్ట్రం వడోదరలో జరిగే అండర్–11 మినీ నేషనల్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించడానికి ఈ పోటీలల నుంచి క్రీడాకారుని ఎంపిక చేస్తారన్నారు.

బంజారా బస్తీలో యూఎల్‌సీ అధికారుల సర్వే

మలక్‌పేట: సలీంనగర్ తీగలగూడ బంజారా బస్తీ గుడిసెల్లో గురువారం యూఎల్‌సీ విభాగం అధికారులు సర్వే నిర్వహించారు. డీఈ సుబ్రమణ్యం సిబ్బందితో కలిసి గుడిసెలను సందర్శించి గుడిసె వాసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుడిసె వాసులు నివాసం ఉంటున్న స్థలంలో గూగుల్ సర్వే నిర్వహించారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను కలిసి గుడిసెవాసులకు ఇళ్లు మంజూరు చేయించాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలంగాణ దళిత, గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బట్టుదాసురావు, ప్రధాన కార్యదర్శి కొర్ర చందులాల్‌నాయక్ తెలిపారు. 2021లో సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు సోషల్ ఎకానమీ సర్వే(ఎస్ఈఎస్) చేసి 131 మందిని అర్హులుగా గుర్తించారన్నారు. నాలుగేళ్లు గడిచినా పేదలకు ఇళ్లు అందలేదన్నారు. కూలీపనులు చేసుకుని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. అందుకు ఎమ్మెల్యే స్పందించి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యూఎల్‌సీ అధికారులు సర్వే చేస్తున్నారని, సర్వే పూర్తయి అనంతరం పేదల సొంతింటి కలను సాకారం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

అసంపూర్తి పనులతో అవస్థలు



ప్రభుత్వ క్వార్టర్స్ సబ్ స్టేషన్‌కు వెళ్లే దారిలో ఇలా

మలక్‌పేట: అసంపూర్తి పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ లైన్–5లో పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ క్వార్టర్స్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే దారి కూడలిలో వాటర్ వర్క్స్ మ్యాన్ హోల్ మరమ్మతులకు కోసం రోడ్డును తవ్వి మరమ్మతులు చేపట్టారు. మ్యాన్‌హోల్ నిర్మాణం కోసం తవ్విన మట్టి రోడ్డుపై కుప్పలుగా పోశారు. రోజులు గడిచినా సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించకపోవడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

యాకత్‌పురా సమగ్రాభివృద్ధికి కృషి

సైదాబాద్: పార్టీలకు అతీతంగా యాకత్‌పురా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ అన్నారు. గురువారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సుబ్రహ్మణ్యనగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలిస్తూ ఆయా కాలనీల్లోని పార్కులను సందర్శించారు. సుబ్రహ్మణ్యనగర్ కాలనీలో పర్యటించిన ఆయనను టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, జయప్రకాష్ జైన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీల్లోని పార్కుల్లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న వాటిని గుర్తిస్తున్నామని తెలిపారు. కాలనీవాసుల సౌకర్యం కోసం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీల్లోని రహదారులు, నాలాల విషయమై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్.ప్రసాదరావు, కేశవ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు